క్లుప్తంగా

పకడ్బందీగా ఎస్ఎంసీ ఎన్నికలు

ఐరాల: మండలంలోని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు గురువారం నుంచి పకడ్బందీగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులకు ఎంఈఓలు రుషేంద్రబాబు, దామోదర్ నాయుడు ఆదేశించారు. ఈ మేరకు ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేశారు. గురువారం ఉదయం 10 గంటలకు నోటిఫికేషన్ విడుదల, మధ్యాహ్నం 2 గంటలకు ఓటరు జాబితాను నోటీస్ బోర్డులో ప్రదర్శించాలన్నారు. 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఓటర్ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించాలని తెలిపారు. 8న ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సభ్యుల ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. సభ్యులు మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారన్నారు. 2 గంటల నుంచి 3 గంటల వరకు చైర్మన్, వైస్ చైర్మన్లతో పాటు కమిటీ సభ్యులందరితో ప్రమాణ స్వీకారం చేయించాలన్నారు. 3.30 గంటలకు తొలి ఎస్ఎంసీ మీటింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

ఎస్ఎంసీ ఎన్నికలకు నోటిఫికేషన్

తవణంపల్లె: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పాఠశాల యాజమాన్య కమిటీలు (ఎస్ఎంసీ) కమిటీల ఎన్నిక కోసం గురువారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈఓ త్యాగరాజులరెడ్డి తెలిపారు. మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో యాజమాన్య కమిటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. పాఠశాలల్లో ఆయా హెచ్ఎంలు ఓటర్ల జాబితాను ప్రదర్శించినట్లు తెలిపారు. 8వ తేదీ విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో నూతన ఎస్ఎంసీ కమిటీలను ఎన్నుకుంటామని వివరించారు. ఈ కమిటీలు పాఠశాలల్లో తరగతుల నిర్వహణ, విధుల వినియోగం ప్రభుత్వ పథకాల అమలుపై పర్యవేక్షిస్తారని తెలిపారు. ఆయా పాఠశాలల్లోని తల్లిదండ్రులు కమిటీ ఎన్నికల్లో పాల్గొని ఏకగ్రీవంగా ఎన్నుకోవడానికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు

ఐరాల: విద్యార్థులు కంటి పరీక్షలు చేయించుకోవాలని జిల్లా అంధత్వ నివారణ సంఘం ప్రోగ్రాం అధికారి డాక్టర్ అర్పిత పిలుపునిచ్చారు. మండలంలోని 35 యర్లంపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో గురువారం జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు కంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. పీఎంఓఓ హరిప్రసాద్ 56 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న నలుగురు విద్యార్థులకు కళ్ల అద్దాలు రెఫర్ చేశారు. విద్యార్థులు కంటి సమస్యలపై అప్రమత్తత అవసరమని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అర్జిత, పీహెచ్ఎన్ జీవకళ, ఏఎన్ఎం, ఆశా కార్యకర్త పాల్గొన్నారు.

రేపు మండల సర్వసభ్య సమావేశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం ఎంపీపీ గీత అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాఘవేంద్ర వర్మ తెలిపారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమవుతుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరు కావాలని వారు పేర్కొన్నారు.

నేడు మారెమ్మ జాతర

బంగారుపాళెం: మండల కేంద్రం బంగారుపాళెం దళితవాడలో శుక్రవారం మారెమ్మ జాతర కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి ఆలయం వద్ద ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారి మారెమ్మ గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

పలు రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో పలు రోడ్ల నిర్మాణానికి ఆర్అండ్‌బీ అధికారులు ప్రతిపాదనలు పంపారు. చిత్తూరు–గుడియాత్తం రోడ్డు 8.65 కిలోమీటర్లు నిర్మాణానికి రూ.10 కోట్లు, కుప్పం నియోజకవర్గంలో 100 కిలోమీటర్లు ప్యాచ్‌వర్క్ పనులకు రూ.1.50 కోట్లు, జిల్లా మొత్తం 120 కిలోమీటర్లు మరమ్మతులకు రూ.60 కోట్లు అవసరమని ఉన్నతాధికారులు నివేదించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు చేసుకోండి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లా కేంద్రంలోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపక పోస్టులకు అర్హులు దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ జీవనజ్యోతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, కళాశాలలో ఖాళీగా ఉన్న జంతుశాస్త్రం, లైబ్రరీ సైన్సు, ఫిజికల్ డైరెక్టర్ పోస్టులకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న వారు దరఖాస్తులను ఈ నెల 5 వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు కళాశాలలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి సంబంధిత సబ్జెక్టులలో 55 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. నెట్, సెట్, పీహెచ్‌డీ పూర్తి చేసిన వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఇతర వివరాలకు 8919962288 నంబర్‌లో సంప్రదించాలని ఆమె కోరారు.

అమ్మపాలు అమృతం

- ముర్రుపాలతో శిశువుకు ఆరోగ్యం
- బిడ్డకు పాలు ఇస్తే తల్లికీ మేలు
- చిన్నారుల్లో రోగనిరోధక శక్తి వృద్ధి
- అంగన్‌వాడీల్లో గర్భిణులకు అవగాహన



బంగారుపాళెం: తగ్గువారిపల్లెలో తల్లిపాలపై అవగాహన ర్యాలీ

బంగారుపాళెం: పుట్టిన బిడ్డకు తొలి ఆహారం, మొదటి టీకా అమ్మపాలే. పిల్లలకు తల్లిపాలు ఎంతగానో తోడ్పడుతాయని వైద్యులు చెబుతున్నారు. శిశువు జన్మించిన వెంటనే వీలైనంత వరకు వేగంగా ముర్రుపాలు తాగించాలి. దీంతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుంది. అందుకే తల్లి పాల ఆవశ్యకతను తెలిపేలా ఏటా ఆగస్టు మొదటి వారంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించేందుకు ఐసీడీఎస్ అధికారులు సిద్ధమయ్యారు. మహిళలు గర్భం దాల్చిన నుంచి తల్లి పాల ఆవశ్యకత, బిడ్డ పోషణ, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి. లేనిపోని అపోహలతో అప్పుడేపుట్టిన బిడ్డను తల్లిపాలకు



బంగారుపాళెం: తుంబకుప్పంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

దూరం చేయరాదు. ముర్రుపాలు ఎంత త్వరగా బిడ్డకు తాగిస్తే అంత ఆరోగ్యం. ఈ నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పించేందుకు ఐసీడీఎస్ ఉద్యోగులు, ఆయాలు సిద్ధంగా ఉన్నారు.

ముర్రుపాలతో రోగ నిరోధక శక్తి

శిశువు జన్మించిన తొలి రోజుల్లో తల్లిపాలు చిక్కగా, పసుపు రంగులో ఉంటాయి. వీటినే ముర్రుపాలు అంటారు. ప్రొటీన్‌లు అధికంగా ఉండడంతో వీటిని శిశువు తీసుకుంటే రోగనిరోధక శకి పెరుగుతుంది. బిడ్డ పుట్టిన అరగంటలోపే ముర్రుపాలు పట్టడం ద్వారా రోగాల నుంచి బిడ్డను రక్షించవచ్చు. ముర్రుపాలలో విటమిన్- ఏ, బీ, తగినంత ఐరన్ విలువలు ఉంటాయి. ముర్రుపాలు శిశువు పేగు బలాన్నిచ్చి, జీర్ణశక్తిని పెంచుతుంది. కామెర్లు, విరేచనాలు వంటి రుగ్మతల నుంచి బిడ్డను కాపాడుగలుగుతాయి.

ఆరు మాసాల వరకు తల్లిపాలే ఆహారం

బిడ్డ పుట్టాక తొలి ఆరు మాసాలు తల్లిపాలే ఆహారం. తప్పని పరిస్థితుల్లో మినహా వేరే ఏ పాలూ బిడ్డకు పట్టించకుండా ఉండడమే మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. మొదటి రెండు నెలల్లో బిడ్డకు రెండు గంటలకు ఒక్క సారి పాలు పట్టాలి. రాత్రిళ్లు పాలివ్వడంతో తల్లి మెదడు నుంచి ప్రోలాక్టిన్ ఎక్కువగా స్రవిస్తుంది. ఇది పాల ఉత్పత్తికి అవసరమైన అతి ముఖ్యమైన హార్మోన్. ఎంత రాత్రి అయినా తల్లి పాలివ్వడం బిడ్డకు క్షేమం. నెలలు నిండే కొద్దీ ఈ వ్యవధి పెంచుకోవచ్చు. ఆరు నెలలు తల్లిపాలు ఇవ్వడం ద్వారా బిడ్డకు తేలికగా జీర్ణమవుతుంది. శ్వాసకోశ, అలర్జీ, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి పిల్లలకు రక్షణ ఇస్తాయి. ఆరు నెలల తర్వాత బిడ్డకు తల్లిపాలతో పాటు వైద్యుల సూచనల మేరకు ఇతర ఆహారం ఇవ్వాలి.

బిడ్డకు అమృతంలాంటివి ముర్రుపాలు

ముర్రుపాలు పట్టించడం భారం అనుకోకూడదు, బాధ్యతగా భావించాలి. పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు పట్టించాలి. ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే తాగించాలి. వారోత్సవాలలో భాగంగా ర్యాలీలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తాం. ఐసీడీఎస్ పరిధిలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అవగాహన సదస్సులు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.
– వాణిశ్రీదేవి, సీడీపీఓ, బంగారుపాళెం

ఇవీ ప్రయోజనాలు

- తల్లి పాలలో ప్రొటీన్లు, లాక్టోఫెరిన్, కోలోస్ట్రమ్‌తో పాటు కొన్ని కీలకమైన హార్మోన్లు, రోగ నిరోధక శక్తి బాక్టీరియా ఉంటాయి.
- తల్లి పాలు తాగే పిల్లలు ఎక్కువగా బలంగా ఉంటారు. వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుంది.
- తెలివి తేటలు అధికంగా ఉంటాయి. డబ్బా పాలు తాగే పిల్లలకంటే చురుగ్గా ఉంటారు.
- బిడ్డకు పాలు ఇవ్వడం ద్వారా తల్లీబిడ్డల మధ్య అనుబంధం పెనవేసుకుంటుంది. తల్లి పాలు తేలికగా జీర్ణమవుతాయి.
- ఎలాంటి క్రిములు లేకుండా ఉంటాయి. బిడ్డ దవడలు బాగా బలమవుతాయి.
- పాలిచ్చే తల్లులకు నెలసరిలో రక్త స్రావం కూడా తక్కువగా ఉంటుంది.
- పాలిచ్చినంత కాలం మళ్లీ గర్భం దాల్చకుండా గర్భనిరోధకంగా కూడా పనిచేస్తోంది.
- తల్లులకు రొమ్ము, గర్భాశయ క్యాన్సర్లు రావు.

తల్లిపాలే బిడ్డకు రక్ష



మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో గురువారం తల్లిపాల వారోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా తల్లులకు తల్లిపాల వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు తాగించాలన్నారు. ముర్రుపాలతో బిడ్డకు వ్యాధి నిరోధక శక్తి పెరుగుతోందన్నారు. ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వడం శ్రేష్టమన్నారు. విధిగా పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, డీఐఓ హనుమంతరావు, వైద్యాధికారులు ఉషశ్రీ, లత తదితరులున్నారు.

తల్లిపాలు బిడ్డకు అమృతం

గుడిపాల: తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానమని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి సంధ్య అన్నారు. గుడిపాలలోని వసంతాపురం సచివాలయం పరిధిలో గురువారం తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణీలు, బాలింతలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టిన అరగంటలోపు బిడ్డకు తల్లిపాలు తాగించాలన్నారు. ప్రతి ఏటా తల్లిపాల వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అధ్యయనం



నంజంపేటలో ప్రకృతి వ్యవసాయ పంటలను పరిశీలిస్తున్న రాజస్థాన్ బృందం

చిత్తూరు అగ్రికల్చర్: జిల్లాలో సేంద్రియ పద్ధతిలో సాగవుతున్న పంటలపై అధ్యయనం కోసం రాజస్థాన్ నుంచి విచ్చేసిన అటల్ భూజల్ యోజన బృందం శుక్రవారం సోమల మండలంలో పర్యటించింది. ఈ సందర్భంగా వారు మండలంలోని నంజంపేట, సరస్వతిపురంలలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగవుతున్న పంటలను పరిశీలించారు. లిల్లీ పూల తోటలో 22 రకాల పూల మొక్కలు, కూరగాయల సాగు మోడల్ విధానాన్ని పరిశీలించారు. వాటి ఉపయోగాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. పంటల సాగులో పొలంలో పాటిస్తున్న పద్ధతులను ఏవిధంగా చేపడతారన్నది ప్రయోగాత్మకంగా రైతులతో చేయించారు. ఏ గ్రేడ్ , పీఎండీఎస్, ఎన్‌పీఎం షాప్, కెటిల్ షెడ్ ఉపయోగాలను వారు పరిశీలించారు. లిల్లీ పూల తోటలో ప్రధాన పంటలుగా మామిడి, మహాగని, వక్క, మునగ, జామ, బెండ, వంగ, టమాట తదితర 22 రకాల పంటలు సాగు చేస్తున్నామని రైతు మహేష్ బృందానికి వివరించారు. వీటికి ప్రతి 15 రోజులకు ఒకసారి ద్రవ, జీవామృతం పిచికారీ చేస్తామని తెలిపారు. చీడ పీడలు ఎక్కువగా ఉన్నపుడు కషాయాలను పిచికారీ చేసి పూర్తిగా సహజ సిద్ధమైన ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో పండిస్తున్నామని రైతు తెలియజేశారు. రసాయన పద్ధతిలో 5 ఎకరాల్లో పండించే పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఒక ఎకరంలోనే పండించి అధిక ఆదాయాన్ని పొందామని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర హెచ్ ఆర్ శ్రీనివాసులు, ఎస్ఆర్‌ఓ కృష్ణారావు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వాసు తదితరులు పాల్గొన్నారు.

98 శాతం పింఛన్ల పంపిణీ



తవణంపల్లె: ద్వారకపురంలో వృద్ధురాలికి పింఛన్ పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ వెంకటేశ్వర్లు

చిత్తూరు అర్బన్: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ నాయుడు అన్నారు. గురువారం నగరంలోని దొడ్డిపల్లెలో ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల నగదును లబ్ధిదారులకు అందచేశారు. కార్పొరేషన్ పరిధిలో 98 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట మేయర్ అముద, కమిషనర్ అరుణ, టీడీపీ నేతలు నళిని తదితరులు ఉన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో జగన్మోహన్ ప్రజల నుంచి పలు సమస్యలు ఫోన్ ద్వారా తెలుసుకున్నారు. మొత్తం 48 ఫిర్యాదులు అందగా, వీటిని వీలైనంత త్వరగా విచారించి, పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

9,481 మందికి పింఛన్ల పంపిణీ

తవణంపల్లె: మండలంలో 9,481 మంది లబ్ధిదారులకు పింఛన్లను పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలో 9,821 మంది పింఛన్ల లబ్ధిదారులు ఉండగా 9,777 మందికి ఈ మాసంలో పింఛన్‌లు మంజూరైనట్లు పేర్కొన్నారు. మండలంలో 44 మంది మరణించడంతో వారి పింఛన్లను రద్దు చేసినట్లు వివరించారు. గురువారం మండలంలో 9,481 మందికి రూ.3,92,8000 నగదు పంపిణీ చేసినట్లు తెలిపారు. మిగిలిన లబ్ధిదారులకు శుక్రవారం ఇంటింటికి వెళ్లి పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు.

ఇద్దరు ఏఈలపై చర్యలు

చిత్తూరు కార్పొరేషన్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఇద్దరు ట్రాన్స్‌కో ఏఈలపై చర్యలు తీసుకున్నారు. వర్క్ ఆర్డర్లు పూర్తిచేయనందుకు పైపల్లె ఏఈ కిరణ్‌కుమార్‌ను తాత్కాలికంగా రిలీవ్ చేశారు. అతని స్థానంలో ఐరాల ఏఈ చలపతికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల కలకడ మండలం ఎల్లగుండిపాళ్యం సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీనిపై ప్రాథమిక బాధ్యతగా ఏఈ వరప్రసాద్‌ను తాత్కాలికంగా రిలీవ్ చేశారు. ఆ సబ్‌స్టేషన్‌లోని ఇద్దరు షిఫ్ట్ ఆపరేటర్లను శాశ్వతంగా విధుల నుంచి తొలగించారు. ఈమేరకు కలికిరి ఏఈ ముజుర్‌రెహ్మాన్‌కు కలకడ ఇన్‌చార్జి ఏఈగా బాధ్యతలు ఇస్తూ ఎస్ఈ సురేంద్రనాయుడు ఉత్తర్వులు జారీచేశారు.

నిరుపేదలకు వరం ఫ్యామిలీ డాక్టర్





వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ పూర్ణలత, గర్భిణులకు బీపీ పరీక్షలు చేస్తున్న డాక్టర్ వినయ్‌కుమార్

ఐరాల: మారుమూల ప్రాంతాల్లోని నిరుపేదలకు ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం వరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ పూర్ణలత అన్నారు. మండలంలోని ఇరువారంపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో డాక్టర్ 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. మంచానికే పరిమితమైన రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి ఆరోగ్య పరిస్థితులు తెలుసుకుని మందులు అందజేసి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ మాట్లాడుతూ పీహెచ్‌సీ పరిధిలో బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియ శుక్రవారం ముగియనుందని, వ్యాక్సినేషన్ విధిగా వేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ సుధాకర్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గర్భవతులు పౌష్టికాహారం తీసుకోవాలి

తవణంపల్లె: గర్భవతులు రక్తహీనత రాకుండా మంచి పౌష్టికాహారం తీసుకోవాలని డాక్టర్ వినయ్‌కుమార్ సూచించారు. మండలంలోని నల్లిశెట్టిపల్లెలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శిబిరం నిర్వహించి గర్భవతులకు, బాలింతలకు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులతో పాటు వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. దోమ కాటుకు గురి కాకుండా దోమ తెరలు వాడాలని, వేపకు పొగ వేయించుకోవాలని వివరించారు.



గుడిపాల: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ సంధ్య

జ్వరాలు సోకిన వెంటను డాక్టర్‌ను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్యసేవలను సద్వినియోగం చేసుకోండి

గుడిపాల: వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలని గుడిపాల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సంధ్య అన్నారు. గురువారం గుడిపాల మండలంలోని వసంతాపురంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ సంధ్య 60 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి తగు సూచనలు ఇచ్చారు. అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. గర్భవతులు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది జబసెల్వి, చంద్ర, విజయమ్మ, ఉమ, సుజిమ పాల్గొన్నారు.

4న సీపీఐ జనరల్ బాడీ సమావేశం



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి నాగరాజు

చిత్తూరు కార్పొరేషన్: సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈ నెల 4న చిత్తూరులో జరుగుతుందని, కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ నాయకులతో చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పార్టీ బలోపేతం, ప్రజా సంఘాల విస్తరణ, జిల్లా సమగ్ర అభివృద్ధిపై చర్చ ఉంటుందన్నారు. పలు అంశాలను చర్చించి అనంతరం భవిష్యత్తు కార్యాచరణను ప్రకటించనున్నమన్నారు. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు ఏ రంగంలోనూ చిత్తూరు అభివృద్ధి కాలేదని వాపోయారు. జిల్లాల విభజన సందర్భంగా పక్కన ఉన్న జిల్లాలు అభివృద్ధి చెందుతున్నాయే తప్ప చిత్తూరు అలాగే ఉండడం బాధాకరమన్నారు. జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం పరిశ్రమలు, కేంద్ర విద్యాలయ సంస్థలు, యూనివర్సిటీల ఏర్పాటుకు పార్టీ తరఫున పోరాటాలు చేస్తామన్నారు. 4న జరిగే సమావేశానికి పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జగదీష్, హరినాథరెడ్డి, ఓబులేసు, రామానాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొంటారన్నారు. నగరి, జీడీ నెల్లూరు, పూతలపట్టు, పుంగనూరు, పలమనేరు, కుప్పం, చిత్తూరు నియోజకవర్గంలోని పార్టీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు హాజరై సమావేశాన్ని జయప్రదం చేయాలని వివరించారు. కార్యక్రమంలో నాయకులు మణి, విజయ్ కుమార్, బాలాజీ రావు తదితరులు పాల్గొన్నారు.

టమాట ధర ఢమాల్

- రెండు వారాలకు ముందు బాక్సు ధర రూ.1000 పైనే
- ప్రస్తుతం బాక్సు ధర రూ.300
- ఉత్తరాది రాష్ట్రాల్లో వర్షాలే కారణం
- భారీగా పడిపోయిన ఎగుమతులు



పలమనేరు మార్కెట్‌కు వచ్చిన టమాటాలు

పలమనేరు: పలమనేరు హార్టికల్చర్ డివిజన్ పరిధిలో రెండు వారాలకు ముందు ట మాటా బాక్సు ధర రూ.1000 దాటింది. టమాటా సాగు చేసిన రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అయితే ఉత్తరాది రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా అక్కడి వ్యాపారులు రాకపోవడంతో ఇక్కడ సరుకు అమ్ముడుపోవడం లేదు. దీంతో ఇక్కడి నుంచి సరుకు బయటి రాష్ట్రాలకు వెళ్లడం లేదు. ఫలితంగా ధరలు భారీగా తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం పలమనేరు మార్కెట్‌లో 14 కిలోల బాక్సు ధర గరిష్ఠంగా రూ.300 పలుకుతోంది.

వారం రోజుల్లో తగ్గుముఖం

పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లో పలమనేరు, పుంగనూరు, వీకోట, సోమల, సదుంలో పెద్ద టమాటా మార్కెట్లు ఉన్నాయి. గత నెల ఆఖరివారంలో బాక్సు ధర రూ.1000 పలుకగా, ఈ వారం రోజుల్లో రూ.500 చేరి, ఇప్పుడు రూ.300కు పడిపోయింది.

వర్షాలు తగ్గుముఖం పడితేనే !

సాధారణంగా ఈ ప్రాంతం నుంచి టమాటాలు తెలంగాణా, ఢిల్లీ, యూపీ, కేరళ, మధ్యప్రదేశ్, హర్యానా, కోల్‌కతాతో పాటు బంగ్లాదేశ్‌కు ఎక్కువగా వెళ్తుంటాయి. అయితే ఆయా రాష్ట్రాల్లో వర్షాల కారణంగా ఇక్కడి నుంచి సరుకుతో వెళ్తున్న లారీలకు అన్‌లోడింగ్ సమస్య తలెత్తుతోంది. పైగా అక్కడి వ్యాపారులు సరుకు కొనేందుకు రావడం లేదు.

పశు పోషణలో మెళకువలు పాటించాలి

- వర్షాకాలంలో వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి
- సకాలంలో చికిత్స చేయించి వ్యాధులను అరికట్టాలి



తవణంపల్లె పశువుల ఆసుపత్రిలో పశువులకు పరీక్షలు చేస్తున్న వెటర్నరీ డాక్టర్ లావణ్య

తవణంపల్లె: రైతులు పశు పోషణలో మెళకువలు పాటిస్తే ఆరోగ్యమైన పశువులను పొందవచ్చన్నారు. మండలంలోని 95 శాతం మంది రైతులు పశుపోషణపై ఆధారపడి జీవిస్తున్నారు. మండలంలోని 32 పంచాయతీల్లో రైతులు, రైతులు కూలీలు సైతం పాడి పశువులను పోషించుకొంటూ జీవనం సాగిస్తున్నారు. పాడి పశువుల ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబ పోషణతో పాటు పిల్లల చదువులకు, నిత్య అవసరాలను తీర్చుకొంటున్నారు. ఈ నేపథ్యంలో పశుపోషణలో తగు జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది. ముఖ్యంగా వర్షాకాలంలో పశువులకు వ్యాపించే వ్యాధులు, నివారణపై రైతులకు అవగాహన ఉండాలి. వర్షాకాలం ఏమరుపాటుతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రైతులు అప్రమత్తతోనే పశువులను కాపాడుకోవాలి.

వర్షాకాలపు వ్యాధులు

వర్షాకాలంలో కొత్తగా పచ్చిగడ్డి ఏపుగా పెరుగుతుంది. పచ్చిగడ్డిపై ఉండే కీటకాలు కలుషితమై పశువులు మేత మేయడంతో పశువులకు, గేదెలకు, మేకలు, గొర్రెలకు పలు రకాల వ్యాధులు సోకి అనారోగ్యం పాలవుతున్నాయి. ముఖ్యంగా గొంతువాపు వ్యాధి, గాలికుంటు వ్యాధి, జబ్బవాపు వ్యాధి, కుందేటి వెర్రి వ్యాధి, థైలేరియాసిస్, బెబిసియెసిస్ వంటి వ్యాధులు వ్యాపిస్తున్నాయి. రైతులు అప్రమత్తమై పశు వైద్యాధికారులను సంప్రదించి వ్యాధులు నివారణకు సకాలంలో చర్యలు చేపట్టి నివారించవచ్చు. పాడి పశువులపై ఆధారపడే రైతులు పశుపోషణలో మెళకువలు పాటించాల్సి ఉంది.

వెటర్నరీ డాక్టర్ల సలహాలు పాటించాలి



వర్షాకాంలో పశువులకు సోకే వ్యాధుల నివారణకు వెటర్నరీ డాక్టర్ల సలహాలు పాటించి పశువులను కాపాడుకోవాలి. రైతులు వ్యాధి లక్షణాలు గుర్తించి సకాలంలో డాక్టర్ దగ్గర వైద్యం చేయించాలి. వర్షాకాలంలో పశువులకు సూక్ష్మజీవులు వల్ల వ్యాధులు సంక్రమిస్తాయి. కలుషితమైన నీరు , మేత ద్వారా రోగ నిరోధకశక్తి తగ్గి వ్యాధిబారిన పడుతాయి. వైరస్ సోకడం, కలుషితమైన గాలి ద్వారా కూడా వస్తాయి. బాక్టీరియా, రక్తంలో ఉండే ట్రిపనోసోనియా పరాన్నజీవులతో సంక్రమించే వ్యాధులపై అవగాహన చేసుకొని సకాలంలో డాక్టర్ల సలహాలు తీసుకోవాలి. – డాక్టర్ లావణ్య, పశువైద్యాధికారి, తవణంపల్లె